AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
12-8-2026 (Wednesday) MAIN EDITION

## ఇరాన్‌తో చర్చలపై నమ్మకం లేదు: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి గట్టిగా హెచ్చరించారు. ఆ దేశంతో జరుగుతున్న చర్చలపై తమకు ఎలాంటి నమ్మకం లేదని, వారు ఎప్పుడూ అబద్ధాలే చెబుతారని ఆయన మండిపడ్డారు. హర్మూజ్ జల సంధిపై ప్రస్తుతం సంపూర్ణ నియంత్రణ అమెరికా చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. ఈసారి చర్చల నుంచి వెనక్కి తగ్గినా, లేదా ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ తేల్చిచెప్పారు.

## డీలిమిటేషన్‌ను వ్యతిరేకించిన సీఎం విజయ్



**అక్షరటుడే, చెన్నై:** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం వరుసగా కీలక తీర్మానాలను ప్రవేశ పెడుతోంది. ఇప్పటికే రాష్ట్రగీతం, నీట్ పరీక్షలపై తీర్మానాలు చేయగా.. తాజాగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ (డీలిమిటేషన్)పై మరో తీర్మానాన్ని తీసుకువచ్చింది. కేంద్రం తీసుకువచ్చిన డీలిమిటేషన్ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూనే, మహిళా రిజర్వేషన్ బిల్లు కు మాత్రం ప్రభుత్వం మద్దతు తెలిపింది. అయితే, ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల ప్రాతిపదికనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.

### లోక్‌సభ రేపటికి వాయిదా



**అక్షరటుడే, ఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఉభయ సభల్లో ప్రతిపక్షాల నిరసనల హోరు కొనసాగడంతో లోక్‌సభ రేపటికి వాయిదా పడింది. విపక్షాల గందరగోళం మధ్య సభను నడపడం సాధ్యం కాకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు.

### అసెంబ్లీ సెషన్‌కు విద్యార్థులకు అవకాశం




**అక్షరటుడే, ఏపీ:** అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలను ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తున్నట్లు శాసనసభ సెక్రటేరియట్ పేర్కొంది. స్కూళ్లు, కాలేజీల HM, ప్రిన్సిపల్స్ ముందుగా విద్యార్థుల జాబితాతో లేఖను 'legis.passes@gmail.com' సూచించింది.


### రేపు ఉచిత కుట్టుమిషన్ల పథకం ప్రారంభం



**అక్షరటుడే, హైదరాబాద్ :** బీసీ మహిళల కోసం ఉచిత కుట్టుమిషన్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి వెయ్యి చొప్పున ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నారు. పథకానికి సంబంధించిన విధివిధా నాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ వివరాలను ప్రకటించనున్నారు.

## స్మార్ట్ బజార్‌లో 'ఫుల్ పైసా వసూల్' సేల్

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** రిపబ్లిక్ డే ఆఫర్ల పోటీలోకి రిలయన్స్ స్మార్ట్ బజార్ ఎంట్రీ ఇచ్చింది. ఫుల్ పైసా వసూల్ పేరుతో ఆగస్టు 1216 వరకు ప్రత్యేక సేల్ నిర్వహిస్తోంది. సాధారణ షాపింగ్ అవసరాలపై మరింత ఆదా చేయడంలో సహాయపడడం, గృహ మరియు వ్యక్తిగత సంరక్షణ, ప్రాసెస్ చేసిన ఆహారం, స్టేపుల్స్, ఫ్యాషన్ తదితర కేటగిరీలలో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులో ఉంచినట్లు కంపెనీ తెలిపింది. చాలా వస్తువులపై బై వన్ గెట్ వన్ ఆఫర్‌ను అందిస్తోంది.



## రియల్‌మీ నుంచి మరో ఫోన్ విడుదల

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ కంపెనీ అయిన రియల్‌మీ.. తన 16 సిరీస్‌లో మరో మోడల్‌ను యాడ్ చేసింది. ఇప్పటికే రియల్‌మీ 16, 16టీ, 16ప్రో, 16 ప్రో ప్లస్ మోడళ్లు మార్కెట్‌లో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా ఆగస్టు 12న 16 ఎక్స్ మోడల్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. మొదటి సేల్ ఆగస్టు 13న మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కానుంది. ఇది రియల్మీ అధికారిక వెబ్‌సైట్‌తోపాటు ఫ్లిప్‌కార్ట్, ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ అందుబాటులో ఉంటుంది. లాంచింగ్ ఆఫర్‌లో భాగంగా రూ. 2 వేల వరకు డిస్కౌంట్ అందిస్తోంది.




# హెచ్‌సీయూలో డ్రగ్స్ కలకలం..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) క్యాంపస్‌లో విక్రయం కలకలం రేపింది. ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 17 మంది విద్యార్థులు గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. డ్రగ్స్ రాకెట్‌కు సంబంధించి అస్సాం నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి ఎక్కడ నుంచి వచ్చింది. ఎన్ని రోజులు నుంచి దందా కొనసాగుతుందనే కోణంలో విచారిస్తున్నారు.

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్
- పెడ్లర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలంగాణ ఈగల్ టీమ్, పోలీసులు బుధవారం సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. క్యాంపస్‌లో డ్రగ్స్ సేవించడం, విక్రయాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానిత విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, ఏకంగా 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు తేలడం వర్సిటీలో కలకలం రేపింది.


### అస్సాం నుంచి సరఫరా..

యూనివర్సిటీ పరిధిలో అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అస్సాం రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువచ్చి హెచ్‌యూవీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. క్యాంపస్‌లో ఒక్కో గ్రాము గంజాయిని రూ.500 చొప్పున అమ్ముతున్నట్లు తేలింది. ప్రస్తుతం వర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ తనిఖీలు కొనసాగుతుండగా, ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత తెలియనున్నాయి.

### దందాపై లోతైన విచారణ

ఈ కేసులో ఓ పెడ్లర్‌ను ఈగల్ టీమ్ విచారిస్తోంది. అతడికి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, నెట్‌వర్క్‌కు సంబంధించిన వివరాలను అధికారులు ఆరా తీస్తున్నారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగం పెరగకుండా కట్టడి చేసేందుకు అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నారు. హెచ్‌సీయూ గంజాయి సరఫరా వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

## విపక్షాలకు అమిత్ షా సవాల్..



**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన దాడుల వ్యవహారానికి సంబంధించి, దీని వెనుక ఎవరి ఆదేశాలు ఉన్నారో ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభలో మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఈ కీలక అంశంపై సమగ్ర చర్చకు ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. విపక్షాలు హంగామా మాని సభలో చర్చకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చర్చకు సంబంధించి విపక్షాల ముందు పలు కీలక ప్రతిపాదనలు ఉంచారు. మధ్యాహ్నం 2 గంటలలోపు స్పీకర్‌కు లేఖ సమర్పిస్తే 3 గంటల నుంచే చర్చను ప్రారంభించవచ్చని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పార్లమెంటరీ నిబంధనల ప్రకారం సమగ్ర చర్చ జరగాలని ఆయన స్పష్టం చేశారు. విపక్షాలు సభలో అర్థవంతమైన చర్చ కోరుకుంటున్నాయా లేక కేవలం గందరగోళం సృష్టించాలనుకుంటున్నాయా అనేది ఇప్పుడు వారే తేల్చుకోవాలని అమిత్ షా సవాల్ విసిరారు.


## రీల్స్ సంస్కృతికి దూరంగా ఉండాలి.. యువతకు మోదీ పిలుపు..



**అక్షరటుడే, ఢిల్లీ:** సోషల్ మీడియా, రీల్స్ కాలంలో యువత పుస్తక పఠన అలవాటును కోల్పోకూడదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న "షార్ట్‌కట్ సంస్కృతి" పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. సెకన్ల వ్యవధిలో మారిపోయే రీల్స్, సోషల్ మీడియా మోజులో పడి యువత తమ ఏకాగ్రతను, లోతైన ఆలోచనా శక్తిని కోల్పోతున్నారని మోదీ హెచ్చరించారు. జీవితంలో నిజమైన పాఠాలు నేర్చుకోవడానికి, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడానికి ఆత్మకథలు, పుస్తక పఠనం ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రలు చదవడం ద్వారా వారు ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల స్ఫూర్తిని పొందవచ్చన్నారు.

## బేహారీ లాల్ ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఐపీవోల సందడి కొనసాగుతోంది. బుధవారం బేహారీ లాల్ ఇంజినీరింగ్ కంపెనీ ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. ఈ కంపెనీ ప్రధానంగా స్టీల్, విద్యుత్, హెవీ ఇంజినీరింగ్ వంటి పరిశ్రమల్లో వినియోగించే మెటల్ రోల్స్, ఇంజినీరింగ్ కాస్టింగ్స్, అల్లాయ్ స్టీల్ ఉత్పత్తులు, ఫోర్జింగ్ ఇంగాట్స్ తయారు చేస్తుంది. కంపెనీ ఐపీవో ద్వారా రూ. 302 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ. 93 కోట్ల విలువైన ఫ్రెష్ ఇష్యూ ఉండగా.. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా మిగతా మొత్తాన్ని సమీకరించనుంది. కంపెనీ ధరల శ్రేణిని రూ. 271 నుంచి రూ. 285గా నిర్ణయించింది. ఒక లాట్‌లో 52 షేర్లున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ కోసం గరిష్ట ప్రైస్ బ్యాండ్ వద్ద రూ. 14,820 తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.







## అమిత్ షా రాజీనామా చేయాలి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఇదే క్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలపై జరిగిన లాఠీఛార్జ్ వ్యవహారంపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చకు సిద్ధమని అమిత్ షా ప్రకటించగా.. దీనిపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. యువతకు అమిత్ షా చేసే ఉపన్యాసాలపై ఎలాంటి ఆసక్తి లేదని, ఆయనలో ధైర్యం కొరవడిందని రాహుల్ గాంధీ విమర్శించారు. గత 20 రోజులుగా అమిత్ షా సభలో కనిపించడం లేదని, ధైర్యం లేకనే ఆయన రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని విద్యార్థులపై కాల్పులు జరిపింది ఎవరని ప్రశ్నించిన ఆయన.. ఒకవేళ కాల్పులు జరపాలని అమిత్ షానే ఆదేశించి ఉంటే, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## అధికారం శాశ్వతం కాదు..: కేటీఆర్

**అక్షరటుడే, హైదరాబాద్:** అధికారం శాశ్వతం కాదని, అయితే ప్రజల కోసం చేసిన మంచి పనులు మాత్రం ఎప్పటికీ నిలిచిపోతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం అనేక గొప్ప కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కేటీఆర్ తెలిపారు. ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించకపోవడం సరైంది కాదన్నారు. కేసీఆర్ హయాంలో ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్యం అందించామని తెలిపారు.





## దేవరయాంజల్‌లో అగ్నిప్రమాదం

**అక్షరటుడే, మేడ్చల్:** మేడ్చల్ జిల్లా తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజల్‌లో బుధవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక 'డైరీ క్లాసిక్ ఐస్‌క్రీమ్' కంపెనీకి చెందిన కోల్డ్ స్టోరేజ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయం వేళ షార్ట్ సర్క్యూట్ కావడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. క్షణాల్లోనే మంటలు చుట్టుముట్టడంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన నల్లటి పొగ కమ్ముకుంది. ఇది చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.